లన్నంత వుత్సాహం వొచ్చిందిగానీ చిదంబరం వారించడంతో ఆగిపోయాడు.

● ● ●

ఉదయం నాలుగ్గంటలప్రాంతాల్లో జగన్నాధానికి మెలుకువ వొచ్చింది. తన పక్కనే అర్ధ నగ్నంగా పడుకున్న కుసుమని చూచి గట్టిగా కళ్ళు మూసుకున్నాడు. అప్పుడతనికి లీలగా, గడిచిన రాత్రి తన అనుభవం గుర్తు కొచ్చిండి. గుర్తుకొచ్చిన కాసేపటికి కళ్ళల్లో నీళ్లు తిరిగాయి.

అక్కడే వున్న కుర్చీలో కూలబడిపోయి మొహాన్ని చేతుల్లో దాచుకుని కుళ్ళి కుళ్ళి ఏడుస్తున్నాడు. ఎక్కడినించి వొచ్చాడో సుడిగాలిలా వొచ్చేడు చిదంబరం. వొచ్చి లైట్ వేసి అన్నాడు—

"గుడ్ మార్నింగ్ బ్రదర్!"

"... ... ... ..."

"ఛ. ఏడుస్తున్నా వెందుకోయ్?" దగ్గరిగా వొచ్చి జగన్నాధం భుజం కుదుపుతో అడిగేడు.

అతను మరింతగా కుదించుకుపోయాడు. చిదంబరం మెల్లిగా నవ్వి జోలపాట పాడేడు—

'ఏడవకు ఏడవకు వెర్రినా తండ్రీ!
ఏడిస్తే నీ కళ్ళు నీలాలు కారు,
నీలాలు కారితే నే చూడలేను...
జో... జో.'

జగన్నాధం చివాలున లేచి నిలబడ్డాడు. గట్టిగా అరిచేడు.

"నామీద నీ కెందుకింత కసి? బాధల్లో ఛస్తున్నా నీతిగా బ్రతుకుతున్నాను. రాత్రి ఆ నీతికి స్వస్తి చెప్పించావ్. ఇది నీవల్ల జరిగింది. నువ్వే దీనికి కారణం. నువ్వే చిదంబరం. నువ్వే."

ఈ అలజడికి కుసుమ కళ్ళు విప్పింది. భయంతో లేచి నిలబడింది. కుసుమని ఓదార్చాలనే ఉద్దేశంతో చిదంబరం అన్నాడు—

"దేరీజ్ నథింగ్ టు ఫియర్ మిస్ కుసుమా! జస్ట్ మిసండర్‌స్టాండింగ్. ఇలాంటి మనిషిని బాగు చేయడం నావల్లకాదు. నిన్న ఉదయం ఈ మంచివాడ్ని అవమానించాననే బాధ కొద్దీ చేరదీసి చక్కటి ఆతిథ్యమిచ్చి క్షమించమని కోరేను. నోటి కొచ్చినట్టు పేలేస్తూన్నాడు. మైడియర్ జగన్నాధం, గెటవే ఫ్రం హియర్. క్విక్. చాతకాని తనం చావనంత వరకూ నువ్వు బాగుపడవు. వెళ్ళు" అన్నాడు చిదంబరం గుమ్మం వేపు చేయిచూపుతూ.

— ఆ ఉదయం నుంచీ జగన్నాధానికి నీతి నియమాలపట్లు కొత్తరకమైన ఆలోచనలు ప్రారంభమయ్యాయి. అతని ఆలోచనల కుచ్చుల టోపీలో యిదో ముచ్చటైన రంగుటీక.

□□□





# అసలైన ఆత్మహత్య

కోఆపరేటివ్ స్టోర్సు సెక్రటరీ పదవినుంచి రంగనాధంగారు విరమణ చేసినట్లు రూఢి అవగానే - మంచివాళ్లు కాకపోయినా, మంచివాళ్ళమీద మంచి అభిప్రాయమున్న మనుషులందరూ హోరని ఏడ్చారు.

"ఒక రకం ప్రజా హృదయానికి ఒకడే నాయకుడు. ఒక యుగంలో ఒక సంఘానికి ఒకడే సంస్కర్త. ఇక ఈ సంఘానికి వైధవ్యం తప్పదు" అనుకుంటున్న ప్రజల మాట విని రంగనాధంగారు చికాకు పడ్డారు.

"ఈ రకం వ్యక్తిపూజ యిప్పుడున్న మహోపద్రవాలలో ముఖ్యమైనది. బానిసతనానికి ప్రథమ చిహ్నం—ఒక్క వ్యక్తి తొలగిపోతే, ఒక్క కెరటం విరిగిపోతే కాల సముద్రం ఆగిపోతుందా? మరొక మహత్తర వ్యక్తి రావచ్చు. ఇంతకుమించి కష్టపడవచ్చు. ముసిలివాణ్ణి. కాళ్ళున్నంత వరకు నడిచి వచ్చాను. కళ్ళున్నంత వరకు లెక్కలు చూశాను.

అశక్తుణ్ణి, నన్ను క్షమించండి. అయినా నేను బతికే ఉన్నాను. బతికి ఉన్నన్నాళ్ళూ మన సొసైటీ మంచి చెడ్డల గురించి నా ప్రాణం కొట్టుకుంటూనే ఉంటుంది. నా సలహా ఏం కావాలన్నా మీరు ఎప్పుడు పడితే అప్పుడు మా యింటికి రావొచ్చు. నా అనుభవం అంతా రంగరించి ఒక్క విషయంలో ప్రజలకు మార్గదర్శకుణ్ణి అయినా అంతకన్న నేను కోరేది ఉండదు. నాకు శ్రమ అని అనుకోవద్దు. పనికన్న నాకు బ్రతుకులేదు!"

రిక్షా ఎక్కి అది కదులుతూండగా వెనక్కి తిరిగి మూడు గదుల పాత పెంకుటిల్లులా ఉన్న స్టోర్సుని చూసి కళ్ళనీళ్ళు తుడుచుకున్నారు రంగనాథంగారు. నెలకి వెయ్యి రూపాయిలు గడిస్తున్న పాతికేళ్ళ కొడుకు కారు కిందపడి చచ్చిపోయినప్పుడు కూడా ఆయనకి కళ్ళమ్మట నీళ్ళు రాలేదు. పాతిక కాసుల బంగారు నగ, భార్యది దొంగలు దోచుకున్నప్పుడు ఆయనకి కళ్ళమ్మట నీళ్ళు రాలేదు. వీధిగది కట్టడానికి అడ్డొచ్చిందని తను ఆరేళ్ళు ప్రతిరోజూ నీళ్ళుపోసి పెంచిన సువర్ణరేఖ మామిడిచెట్టు కొట్టించినప్పుడు ఆయనకి కళ్ళమ్మట నీళ్ళు రాలేదు.

"ఆయన మనిషా. మరగాని!" అంది రెండో కూతురు.

"అది మనసా, శిలగాని!" అంది భార్య.

"సరిగ్గానే పోల్చుకున్నారర్రా!" అని రంగనాథంగారు నవ్వుకున్నారు ఈ విమర్శలు విని. మూన్నాళ్ళబతుకు నిజంగా మనిషిలా బతికి, విధి నిర్వహణలో సార్థకత సంపాదించాలంటే మనిషి మర కావాలి. మనస్సు శిల కావాలి. తప్పదు అనుకున్నారు.

కాని ఈ మరకూడా చెమురుస్తుందనీ, ఈ శిలకూడా ద్రవిస్తుందనీ — మొదటిసారి తెల్సుకుని ఎప్పుడూ లేనంతగా చలించి పోయారాయన.

రెండో కొడుకు అంటాడు.

"అప్పగారూ. పెద్దవారైపోయారు. ఇంకా ఎన్నాళ్ళు యీ యింటినీ యీ ఊరినీ పట్టుకు వేళ్ళాడతారు? ఈ ఊరేదో మంచి దనుకుంటున్నారు. మొన్న మీకు జబ్బుచేసి నెల్లాళ్ళు ఆసుపత్రిలో ఉన్నప్పుడు ఎంతమంది వచ్చి తొంగి చూశారు? ఏ మంత్రి పంచె గోచీయో ఊడిపోతే అది నేను పెడతానంటే నేను పెడతానని పందేలు వేసుకుని ముందుకొచ్చే మందభాగ్యులు, ఒక్క నిజం చెప్పడానికీ ఒక్క మంచిపని చెయ్యడానికీ వాళ్ళకి ధైర్యమేదీ? ఇలాంటి హృదయంలేని లౌక్యుల మధ్య — రేపొద్దున్న మంచాన పడితే మీ కెలా వెడుతుంది? రెండు తలుపులూ తెరిచి పిలుస్తున్నాను. రెండు చేతులూ జాపి అడుగుతున్నాను. మా యింటికి, నా దగ్గరకి, వచ్చెయ్యండి. మీ అంత మంచి వాళ్ళం కాకపోయినా, మీ కొడుకులం, దుర్మార్గులం కాము. నా దగ్గర విసుగెత్తిపోతే తమ్ముడి దగ్గిరా, వాడి తర్వాత నా దగ్గిరా వుందురుగాని. మా పెళ్ళాలు మిమ్మల్ని సరిగ్గా చూస్తారో చూడరో అని అనుమానమా? అనుమానం దేనికి? చూడరు. రక్తంలోలేని అభిమానం వాళ్ళు మాత్రం వ్యక్తం చెయ్యగలరా? మహా అయితే చూసినట్టు నటిస్తారు. మాకు బుద్ధుంటే వాళ్ళని నమ్మం. మీ బాధ్యత వాళ్ళమీద పెట్టే వెయ్యం. మేమే వెయ్యికళ్ళతో మిమ్మల్ని చూసుకుంటాం. అప్పగారూ, అప్పగారూ, ఒప్పుకోరా, మాతో వచ్చెయ్యరా?"

"నేన్రానా లేన్రా... ...నన్ను చంపకురా నానీ... ..."

ఇన్ని మాటలకు ఒక్క జవాబు! అదేనా అదోలా. అవతలివైపు మొహం పెట్టి.

"సరేలెండి. తమ్ముడికి వ్రాస్తాను. ఇద్దరం వుద్యోగాలు రిజైన్‌చేసి కుటుంబాలతో ఇక్కడికే వచ్చేస్తాం. మీ ఎదురుగుండానే యీ వూళ్ళోనే అడుక్కుతింటాం. అక్కడికిగాని మీకు తృప్తివుండదు!"

"అబ్బబ్బ! నన్ను బాధపెట్టకురా నానీ."

జగన్నాథం అక్కణ్ణించి విసుక్కుంటూ వెళ్ళిపోయాడు.

"అవును. మిమ్మల్ని బాధపెట్టడానికి మాత్రం యిప్పుడెవరున్నారు అప్పగారూ? అమ్మ అల్పాయుష్మంతురాలు. అల్పాయుష్మంతురాలేం, మీ లాంటి మనిషితో ముప్ఫైయేళ్ళు కాపురంచేసి బతికిందంటే చాలా గట్టి ప్రాణమే... ..." అనుకున్నాడు.

బరువైన హృదయంతో రిక్షాలో కూలబడ్డ రంగనాథంగారు అనుకున్నారు "వెర్రివాళ్ళు... ఈ వూరితో నాకు ముడి ఎక్కడో తెలుస్తుంది గనకనా వీళ్ళకి! నాకు మాత్రం యిన్నాళ్ళూ తెలిసిచచ్చింది గనకనా!" అనుకున్నారు మరోసారి ఆ పాత యింటివైపు చూసి. నిజమే. ఇది ఒకనాటి రెణ్ణాళ్ళ బాంధవ్యమా! మూడు ముళ్ళకన్న మోహనకరమైన ముడి యిది. ఆ ముడి పరస్పరాశ్రయమైనది. స్వార్థంతో కూడుకున్నది. గాలి ఎటువీస్తే అటు కెరటాలు లేచే — నాలుగుగట్లమధ్య కట్టుబడ్డ చెరువు లాంటిది. ఇది? వన్ వే ట్రాఫిక్ లాంటిది. చల్లని వెన్నెలలాంటిది. జీవనది లాంటిది. నిర్హేతుకమైన కరుణా, నిస్వార్థమైన సేవా లాంటివే.

రంగనాథంగారు తన ఏభై అయిదవ ఏట జడ్జీగా రిటైరయారు. తర్వాత ఎన్నోసార్లు ఎంతోమంది ఆయనకి మళ్ళీ ఉద్యోగం చెయ్యమని సలహా లిచ్చారు. అసలు ఆ ఉద్యోగంలోనే యింకా పొడిగిస్తామన్నారు.

---

## అవసరాల రామకృష్ణారావు

---

'బాబూ, ఉద్యోగంలో చేరడానికే గాని విరమించడానికి వయసు నిబంధన లేదా యేం? ప్రతీదానికీ ఒక వయసంటూ మనవాళ్ళు పెట్టేరు. దాన్ని అలా పాటించడం మనధర్మం. నాలాంటి ముసలివాళ్ళు చచ్చేదాకా ఉద్యోగాలు చేస్తూ కూచుంటే నిరుద్యోగం ఒక భయంకర సమస్యగా మారుతున్న యీ కాలపు కుర్రవాళ్ళ ఆశలు ఏంకావాలి నాయనా!'

"ఉద్యోగం చేస్తున్నంత కాలమూ పదిగంటల ముందూ, అయిదు గంటల తర్వాతా నాప్రాణాలు తీసేసేవారు. ఇప్పుడు ఇరవై నాలుగ్గంటలూ నన్ను కాల్చుకు తింటారు కాబోలు, యింతకన్న యీయనకిఉద్యోగం ఏముంది!" అనేవి సూరమ్మగారు. కాని ఆవిడ పొరపాటు పడింది. మునుపు తొమ్మిదింటికి తయారైతే యిప్పుడు ఆయన ఆరున్నరకే రెడీ అయిపోయేవారు.

సరిగ్గా ఆ యింటి గేటు వైపే చూడండి. పొద్దుటిపూట గేటు కిర్రుమందంటే అప్పుడే గడియారం సరిగ్గా ఆరున్నర కొట్టినట్లు గుర్తు. పందలపాక నూలు పంచె, పొడుగు చేతుల కళ్ళీలాల్చీ, పాతబడిపోతున్నా పనిచేస్తున్న గొడుగు, చప్పుడు అయినా చెప్పినట్లు నడిచే చెప్పులు, అన్నట్లు లాల్చీమీద కండువామడత, నెరిసినా మెరిసే మీసం, ఒడిలినా నవ్వే మొహం, తలబట్ట ఏదీలేని బట్టతల, తిన్నని స్వభావం సూచించే ముక్కు, జోడు కళ్ళమీదా కళ్ళజోడు- ఇన్నీ యింకొన్నీ కలిపిన దానిపేరు రంగనాథంగారు. నడుస్తున్నపుడు అయే ఆ చప్పుడు యిహా సొసైటీ పెంకుటింటి ముందే ఆగడం. దారిలో ఎవరైనా తెలిసిన వాళ్ళు కనపడితే దంతాల సంఖ్య తగ్గుతున్న నోరు మరింత విశాలం కావొచ్చు. నరాలు పైకి తేలుతున్న పదివేళ్లూ ఒకటి కావచ్చు. కాళ్ళు మాత్రం ఆగవు.

"వయస్సు మళ్ళినా యింకా యీ ముసిలాడికి ఎంత కాపీనమో, ఓ రిక్షా అయినా కట్టించుకోడు" అనుకుంటారు బేరం దొరకని రిక్షావాళ్ళు. ఆ మాటలు విన్నా - తనకి కాపీనం లెదని ఏ అజావో బేడో వాళ్ళ చేతిలో పెట్టవలసిన అవసరం ఆయనకేం లేదు. ఆయనకి ఎలాంటి కాపీనమూ లేదనడానికి ఆధారం లేదుమరి!

'పంక్చువాలిటీ'లోనూ 'సిన్సిరిటీ'లోనూ 'ఎబిలిటీ'లోనూ బ్రిటిషర్సుని మెప్పించిన దిట్ట అది. రూళ్ళ కర్రలాంటి విగ్రహం, జీవితం ఆయనది. ఎవరి దగ్గర నుంచేనా ఉత్తరం వస్తే వెంటనే జవాబు రాసెయ్యడం మరీ విశేషమేం కాదుగాని - ఏ ఉత్తరానికైనా జవాబు అయినా, పెళ్ళామూ కలిసి రాయాలి. కార్డుమీదే రాయాలి. అది రూలు. అంతేకాదు. కార్డులో పెద్ద పక్క తనదీ. రెండో పక్క ఆవిడదీ. దానికి తిరుగుండ కూడదు. భార్యంటే అర్ధాంగి అని అయన కంటె గ్రహించిన వాళ్ళెవరు!





కో అపరేటివ్ స్టోర్సు దగ్గర అగుతారని చెప్పేను కదూ ... అంటే అప్పటికి పావు తక్కువ ఏడవుతుంది. అప్పటికి గుమాస్తాలూ నౌకర్లూ అందరూ అక్కడ ఉండాలి. ఎవరైనా ఒకటి రెండు నిమిషా లాలస్యమైతే రంగనాథంగారు మొహం ఎత్తి, కనుగుడ్డెత్తి, రెప్పెత్తి వాడివైపు చూస్తారు. పబ్లిక్ స్కూలు ప్రిన్సిపాలయినా టీచరువైపు అలా చూసి ఉండడు. ప్రపంచంలో వందమంది మోసగాళ్ళని తప్పించుకోగలం. నిజమైన నిశ్చలమైన నిప్పులాంటి చూపు నిలవొక్కుకోడం మన తరం కాదు. అంతకంటె శిక్షా స్మృతి లేదు.

ఆయన తెప్పించుకునే న్యూస్ పేపరు అక్కడికే వస్తుంది. అది కొంతసేపు చూస్తారు. తరవాత ఎకౌంట్స్ చూస్తారు. రావలసిన స్టాకు వచ్చిందో లేదో, అందులో ఎంత సేల్ అయిందో కనుక్కుంటారు. కస్టమర్స్ కష్టసుఖాలన్నీ దగ్గిరుండి కనుక్కుంటారు. మళ్ళీ తొమ్మిదిన్నరా అయేసరికి ఆ గొడుగు విడుతుంది. ఆ జోడు చప్పుడు వినబడుతుంది. ఇలా ఎన్నాళ్ళు? రోజులలెక్క నేను చెప్పలేను, పదిహేనేళ్ళు — ఒక్కరోజు నాగాలేకుండా జరిగింది. ఇది నిజం, ప్రపంచంలో నిజమన్నది యింకా బతికుందని నమ్మక మున్నవాళ్ళు ఇది నమ్మండి. ఇంతేకాదు, ఇంకా నమ్మలేని సత్యం మరొకటుంది. అది— ఆయన కానీ పుచ్చుకోలేదన్నది! నమ్మలేరా, మీ ఖర్మం. మీ యోగ్యత అంతేనన్నమాట. డబ్బే పుచ్చుకోవాలా ఏమిటి? 'నగదు నానారూప స్వరూపిణి' అంటూరా! ఇంట్లో ఆ పూటకి ఆ వస్తువు లేకపోయినాసరే డబ్బివ్వందే ఆ స్టోర్స్‌లో ఒక్కవస్తువు కొని ఎరగరు. ఇంట్లో ప్రాణంపోతున్నా స్టోర్స్ బంట్రోతును సొంత పనిమీద పంపి ఎరుగరు! ఆయన నిస్వార్ధ సేవకి ఋజువు ఏమిటి అని మీ రడగొచ్చు.... అదృష్టవశాత్తూ ఇక్కడ దాఖలా వుంది! ఈ స్టోర్స్‌కి ఎదురుగుండా మిడిల్ స్కూల్ వుంది చూడండి. అందులో మేష్టర్లు ఎలకలు. ఆ హెడ్మాష్టరు ఒకపందికొక్కు.

---

● మొదటిసారిగా ఒక పెద్దమనిషి మధువు సేవిస్తున్నాడు. మొదటి గ్లాసుతోనే ఇరవైయేళ్ళ యువకునికుండే ఉత్సాహం వచ్చేసింది. రెండో గ్లాసు పుచ్చుకున్నాడోలేదో మూడేళ్ళ పిల్లవాడిలా కల్ల, గుల్లము అని ముద్దమాటలు ముద్దు ముద్దుగా ప్రారంభించాడు. మూడో గ్లాసు ఖాళీ అయ్యేసరికి ఆరు నెలల పాపాయంత చిన్నవాడైపోయి, ఇంటిదాకా పాకుతూ వెళ్ళిపోయాడు. 'టిప్' దాదాడ్!

ఆయన ఆ పదవి అలంకరించేసరికి స్కూలుపేర యాభైవేలు నిలవ వుండేది. ఆయన విరమించేనాటికి కొన్ని వందలు అప్పు మిగిలింది! ఇక పక్కసందులో ధర్మాసుపత్రి వుంది చూడండి. సింహం గుహలోకి వెళ్ళే మృగాల్లా లోపలికి వెళ్ళే రోగుల సంఖ్యే అక్కడ కనబడేది. ఇవతలికి యీ శరీరంతో మాత్రం రారు! కొంచెం అలా వెడితే సబ్-రిజిస్ట్రార్ ఆఫీస్ వుంటుంది... ఇలా మిమ్మల్ని ఆ వూరంతా తిప్పడం నాకు యిష్టం లేదు... ...ఐనా యివన్నీ మీరు ఎరగరా ఏమిటి? ఈ నాయకుల పరిపాలన మీకు వేరే చెప్పాలా? పూర్వం మనుషులు మొదట దొంగతనంచేసి తర్వాత జైలుకు వెళ్ళేవారు, ఇప్పుడు మన నాయకులంతా మొదట జైల్లో వుండి తర్వాత దొంగతనాలు చెస్తున్నారు, అంతే తేడా!

ఒకమాట చెప్పబోయి ఇంకో దాంట్లో పడ్డాను. రంగనాథంగారి నిస్వార్థ సేవకు రుజువు కాదూ మీకు కావలసింది? ఆయన కోపరేటివ్ స్టోర్సు ప్రెసిడెంటుగా ఎన్నికయిన నాడు ఎంతుందో చూడండి. సెక్రటరీగా విరమించిన నాడు ఎంతుందో చూడండి. ఆయన వచ్చిం తర్వాత చూపించిన లాభం ఎంత? డబ్బై అయిదువేలు! కల్మష ప్రధానమైన ఊరినంతా ఒక్క మంచిపనితో పరమ పావనం చేసిన కర్మయోగి ధర్మ సంపాదన! ఒక్కరోజైనా ఒక్క పైసా ఐనా తేడా లేకుండా - పంచేంద్రియాలూ పని చేసేంత వరకూ పాటుబడి, సహకార సంఘం సత్ఫలితం చాటి చెప్పిన సత్యసాధన! ఒకణ్ణి పొగిడితే నాకు ఒళ్ళు తెలీదు. తిట్టినా అంతే. అదికూడా వింటారా? ఆమాటకొస్తే యీ పేరుగల కథ ప్రారంభం ఇక్కడే మరి.

రంగనాథంగారు స్టోర్సు వదిలినా స్టోర్సు మనుషులు ఆయన్ని వదల్లేదు. ముఖ్యంగా పెద్దగుమస్తా గోవిందమూర్తికి ఆయనంటే చెప్పలేనంత గురి. అందుకే ఆయన యిల్లు యితనింటికి దూరమైనా రెండ్రోజుల కోమారు వచ్చి కనపడకుండా ఉండలేడు. కొడుకుల్లాగే యితనూ ఆయన్ని "అప్పగారూ" అని పిలుస్తాడు.

"రేపు డైరెక్టర్సు మీటింగులో కొత్త సెక్రటరీని ఎవర్నో ఒకర్ని ఎంచుకోవాలనుకుంటున్నారు అప్పగారూ! ఇన్నాళ్ళూ ట్రైని చేశారు. ఆనరరీ చెయ్యడానికి ఎవరైనా వస్తారేమోనని ... నా బొందో అని ప్రైవేటు సంస్థలకి వ్యక్తిగతాన్ని మించి మీలా ఎవరు చీమూ రక్తమూ ధారపోస్తారు? నెలజీతం అని నిర్ణయించి ఎవర్నో ఒకర్ని వేసుకుంటారట... ప్రజాధనాన్ని దుర్వినియోగం చెయ్యడానికి ఏ ప్రబుద్ధుడు ముందుకొస్తాడు..."

"అలా అనుకోవద్దనే చెప్పేను గోవిందమూర్తీ! ఒకరి కోసం కాలచక్రం ఎప్పుడూ ఆగిపోదు. మన స్టోర్సుకి మరింత మంచి రోజులు ముందున్నాయేమో!" అన్నాడు రంగనాథంగారు.

ఆ సంగతి కొద్దిరోజుల్లోనే అందరికీ విస్పష్టమైంది. నెలకి నూర్రూపాయిల ఆనరరీ పే మీద తమ అమూల్యమైన కాలాన్ని ఖర్చు పెట్టడానికి ఒప్పుకున్న యాజులుగారు, వెనక ఓసారి దేశమాత కోసం జైలుకెళ్ళి, ప్రస్తుతం రాజకీయ వీరుడుగా చెలామణీ అయి ప్రభుత్వం యిచ్చిన రెండెకరాల మాగాణీ అనుభవిస్తున్న పుణ్యమూర్తి. ప్లీడరు గుమాస్తాగా అనేక సంవత్సరాలు అనుభవం ఉన్నవారు గనక నదిని పైనుంచి చూసే లోతుపాతులు కనిపెట్టగల దిట్ట.

ఆయన పనిలో చేరగానే మొట్టమొదట సంకల్పించిన మంచిపని రంగనాథంగారి ప్రజాసేవకు గుర్తుగా కోఆపరేటివ్ స్టోర్సులో ఒక కాంస్య విగ్రహాన్ని ప్రతిష్ఠించడం. ఆయనతో చెప్పకుండానే ఈ పని జరిగి ఉండేదిగాని ఆయన రూలు మనిషీ, ఫూల్ ప్రూఫ్ మనిషీ కావడం చేత చెవిని వెయ్యక తప్పిందికాదు. ఆ కబురు వినగానే ఆయన మొహం అతి అసహ్యంగా మారిపోయింది.

"మనిషిని మనిషిగా కాక జీవం లేని రాతి బొమ్మలాగో, లోహ విగ్రహంలాగో చూడ్డం మనవాళ్ళు ఎప్పుడు నేర్చుకున్నారు బాబూ? అసలైన స్మృతి హృదయానికి సంబంధించింది. దానికి బాహ్య రూపం యివ్వగలమా? ఇస్తే దాన్ని అగౌరవపరచకుండా ఉంచే సంస్కారం మనకుందా? అయినా నీ బొమ్మా నా బొమ్మా అక్కడ నిలబెట్టడానికి ఇది మన బాబుగారి సొమ్మా? నా మీద మీ అభిమానానికి కృతజ్ఞుణ్ణి. నిజంగా నా దీవనలు మీరు అందుకోవాలంటే కలలోనైనా 'రాజకీయం' ప్రవేశించకుండా కల్మశాంశం జొరబడకుండా ప్రజల కోసమే మీ శేష జీవితం అంకితం చెయ్యండి. మీకు ఏ సలహా కావలసినా నేను యిక్కడే వున్నాను."

యాజులుగారి నుదుట ముడతలు పడ్డాయి. ఆయన మొదటి యత్నమే విఫలమైనందుకు మనసా బాధపడ్డాడు. "ఆహా, లోకం ఇంతే కదా!" అనుకున్నాడు. ఆయన ఈ దేశపు బిడ్డ. ఈ నాయకులు ఆయన గురువులు. వారు చూపుతున్న నడవడి ఆయనకి మంచి వరవడి. వాళ్ళు ఏం చేస్తున్నారు? ఒక మహా నాయకుడు మరణిస్తాడు. మహా నాయకుడు కూడా మనిషే అనీ దేవుడు కాదనీ ఎవరికీ తోచదు. అవసరమూ లేదు. ప్రజల్నందర్నీ చదువుకోని, సదసద్వివేక విహీనులుగా తయారు చేయగలిగినంత కాలం వాళ్ళను కనుగప్పుగలిగించడం సుళువు. మహానీయుడి పేరు చెప్పుకుని తమ మనుగడలు ధృవపరుచుకోవడం, మహాత్ముణ్ణి చాటువేసుకుని మహాలా

ర్యాలు చేస్తున్నట్టు భ్రమింపజేయడం — చెట్టుపేరు చెప్పుకొని కుక్కమూతి పిందెలు జాతి ఫలాలలా చలామణీ కావడం ప్రస్తుతం నాయకులు చేస్తున్న రాజకీయం. ఆ మూసలో తయారైన యాజులు మరొకలా ఎలా చెయ్యగలడు? రంగనాథంగారి నిలువెత్తు విగ్రహం ఒకటి చేయించి నలుగురికీ కనపడేచోట పెట్టిస్తే దాని నీడన తను ఎన్ని చేసినా అడిగేవాడు వుండడు. అన్నవస్త్రాలు లేక ప్రజలు అల్లల్లాడిపోతూంటే వ్యక్తుల పేర్న నాణేలూ, తపాలాబిళ్ళలూ, ఆల్బంలూ, ప్రత్యేక సంచికలూ, నిలువెత్తు విగ్రహాలూ, నెలల తరబడి వెలుగు జ్యోతులూ — ఇవన్నీ అతి భక్తితో ఆచరిస్తున్న అగ్రశ్రేణి నాయకులు అంత అమాయకులా ఏం?

ఏమైతేనేం, ఇది యాజులికి మొదటి అపజయం. విగ్రహస్థాపనకే విరాళార్జనకే ఆ ముసలిఘటం ఒప్పుకుందికాదు. పైగా సలహాలుకూడా యిస్తాడట! నిర్జీవమైన బురఖా కావాలిగాని సజీవమైన సలహా ఎవడికి కావాలి!

కో-ఆపరేటివ్ స్టోర్స్‌ని ఎలా వృద్ధరించడమా అని యాజులు రెండో సారి ఆలోచించాడు. మూడుగదుల పెంకుటిల్లది. బ్యాంకులో బోలెడన్ని ఫండ్సు మూలుగుతున్నాయి. ఆ యిల్లు పడగొట్టించి కొత్తది కట్టించే ప్రతిపాదన యీ సారి మీటింగులో పెట్టి ఆమోదం పొందగలిగితే? యాజులు జాగా అయితే కొనగలిగాడుగాని సరైన యిల్లే కట్టలేక పోయాడు. స్టోర్స్ కొత్త బిల్డింగుతో పాటు తన యిలూ లేపొచ్చు. రామయ్య పెళ్ళితో భీమయ్య ఒడుగు. ఎవరైనా ఏమైనా అనుకుంటారా? ఏడిశారు. ఖాండ్రించి మీద వుమ్మేసినా ఎందరు పెద్దమనుషులు దులుపుకు తిరగటంలేదు గనక! అతను కార్యవాదుల వర్గానికి చెందినవాడు.

కాని అదేం పాపమో ఆ ప్రతిపాదనా నెగ్గలేదు. గోవిందమూర్తి సమయానికి సైంధవుడిలా అడ్డుపడిపోయాడు.

'కార్యాలయాలు కాపురాలు చేసే కాంతామతల్లులుగా ఉండాలని రంగనాథంగారు అనేవారు. ఉన్నవి చాలకపోతే వెనకపెరట్లో రెండు గోడౌన్లు కట్టించుకుందాం. ఉన్న మూడుగదులూ పూర్వకాలపువైనా కట్టుదిట్టంగా యినప్పెట్టెల్లా ఉన్నాయి. వాటిని పడగొట్టడం దేనికి? పని జరగడం ముఖ్యంగాని పై మెరుగులెందుకు?'

ఈసారి యాజులు తనకి అవకాశం ఉన్నంతవరకూ రెండోమనిషి ప్రసక్తి లేకుండా కార్యం సాధించడానికి ప్రయత్నించేవాడు. డైరెక్టర్సులో ఒకరిద్దర్ని రెండు మూడు సార్లు దర్శనం చేసుకుని వాళ్ళకి ప్రశంసల పరవశత్వం ప్రసాదించాడు. కో ఆపరేటివ్ యినస్పెక్టరుని ఒక చిన్నవాణ్ణి — అప్పుడే ట్రైనింగై వచ్చినవాణ్ణి — రూల్సు అన్నీ అడిగి తెలుసుకుని తనకి ఒప్పేలా 'ఇంటర్‌ప్రెట్' చెయ్యడం నేర్చుకున్నాడు. బాధ్యతల మాటకేంగాని హక్కులన్నీ స్వాధీన పరుచుకున్నాడు. దక్షిణగల తాంబూలం యివ్వడం పుచ్చుకోడం నేర్చుకున్నాడు. 'ఇన్నాళ్ళూ నా ప్లీడరు గుమస్తా బుద్ధి ఏమైపోయిందీ.' అని నొచ్చుకున్నాడు. 'కానియ్యి, దేనికైనా కాలం ఖర్మంకలసి రావాలి గదా!' అని సరిపెట్టుకున్నాడు. 'ఏమందుకయినా డోసు క్రమక్రమంగా హెచ్చించాలి. ఇంతగా రోగపూరితమైన సంస్థని ఒక్కమారు బాగు పరచాలంటే నా తరమా?' అని సమాధాన పరచుకున్నాడు. ఆనాటినుంచీ దీక్షగా శ్రమించాడు.

యాజులు చేసిన మొట్టమొదటి పని ఆమూడుగదుల్లో ఒక గదిని తన ఆఫీసురూంగా ప్రత్యేకించి ఉంచేసుకోడం. 'ఎంతెంత పెద్దవాళ్ళైనా యిక్కడికి వస్తారు. నెలనెలా మీటింగులు జరుగుతాయి. ఓ నాలుగు మంచి కుర్చీలయినా లేకపోతేఎలా?' అని రెండొందల ఏభై పెట్టి రోజ్ ఉడ్ ఫర్నిచరు తెప్పించాడు. ఒక సీలింగు ఫేన్ వేయించాడు. టేబిల్ ఫేన్ ఒకటీ. ఖరీదైన కర్టెన్లు తెప్పించాడు. ఒక డజను కప్పులూ, సాసర్లూ, అరడజను లతలుగల గాజు గ్లాసులూ ... ఒక టేమిటి, ప్రజాధనం సద్వినియోగం చేసేటప్పుడు వెనకా ముందూ దేనికి?

శలవు తీసుకున్న ఆఖరు రోజున తప్ప రంగనాథంగార్ని ఎవరూ రిక్షామీద చూడలేదు. 'అయనయితే పోతులాంటి మనిషి. మనిషికి పోతుతనం దేన్నిబట్టి వస్తుందనుకున్నారు? డబ్బునిబట్టి — నెలకి ఆరొందలు పింఛనువస్తే నేనూ ఆడుదును యింతకన్న నాటకాలు! నలుగురూ బలవంత పెడితే కాదనలేక ఒప్పుకున్నానుగాని ఇంత పూచీతో కూడిన పని చెయ్యడానికి నాకేం సత్తువ ఉందని! రానూ, పోనూ రిక్షా ఉంటేగాని నా వల్ల ఔనా?' అని యాజులు భూమ్మీద కాలు పెట్టడం మానుకున్నాడు.

'ఏదో పెద్ద పొడిచేశాం అనుకోడం తప్ప — స్టాఫ్ మెంబర్సు కష్టం సుఖం చూసిందెవరు? వీళ్ళకి ఒకటి యింగ్లీషూ, ఒకటి తెలుగూ, రెండు దినపత్రికలు ఉండాలి. వారపత్రికలు నాలుగు ఉంటేగాని తీరిక సమయంలో వీళ్ళకేం తోస్తుంది!' అని ఎక్కడలేని పుస్తకాలూ తెప్పించి పడేసేవాడు.

'కో ఆపరేటివ్ సంఘం తరవున ఒక పాల సరఫరా కేంద్రం కూడా పని చేస్తే బాగుంటుంది. ఊళ్ళో పెద్ద మనుషులు ఖర్చు పెట్టినా మంచి పాలు దొరక్క మా బాధ పడిపోతున్నారు. అవుల్నీ గేదెల్నీ మనం కొని మేపలేంగాని — పాలు దగ్గిరుండి పితికించి మెంబర్స్‌కి మంచి పాలు పంపించవచ్చు. దీనికి ఇద్దరు సర్వెంట్సుని వేసుకోవాలి. ఒక సైకిలు కొనాలి. కొన్ని సామాన్లు కావాలి.'

ఈ విషయం జనరల్ బాడీ మీటిం

గులో పెట్టినప్పుడు ఒక్క ఓటు తేడాతో యాజులుగారు గెలిచారు. "ఈ మాత్రమైనా, యిప్పటికైనా మనుషులు నా మంచి తనాన్ని గుర్తించినందుకు ధన్యవాదాలు. ఇక నా శేషజీవితాన్ని యిలాగే అర్పించడానికి నిశ్చయించాను!" అంటూంటే ఆయన స్వరం గద్గదమైంది. కళ్ళమ్మట నీళ్ళు తిరిగేయి.

ఒక దేశంగాని ఒక సంఘంగాని ఎల్లకాలం ఒకలాంటివారి ఏలుబడి కింద వుండదు. మంచివాళ్ళూ వుంటారు, చెడ్డవాళ్ళూ వుంటారు. కొందరు ప్రవేశించడం, మరికొందరు విరమించడం చిత్రంగావుండి చరిత్ర సృష్టింపబడుతూ వుంటుంది. అది మీ ముందు కళ్ళకు కట్టేటట్టు వుంచగలిగితే నేను కృతకృత్యుణ్ణే

"నాకు రోజు రోజుకీ అనారోగ్యం ఎక్కువైపోతోంది, ఈ చాకిరీ నావల్లగాదు!" అనడం మొదలుపెట్టేడు కొన్నాళ్ళకు యాజులు.

"ఎవరూ మాట్లాడరేం, నే నిక్కణ్ణుంచి వైదొలగడమే అందరికీ యిష్టంలా వుంది!" అన్నాడు మళ్ళీ ఆయనే. దానికీ ఎవరూ జవాబు చెప్పి వుండకపోదురుగాని—ఆయన అనేకవిధాల "దువ్వి" అంతవాణ్ణి చేసిన రంగభాష్యం దొంగసాక్ష్యం చెప్పక తప్పలేదు.

"ఏం మాట శలవిచ్చారు పంతులుగారూ! మీరు అలా అనొచ్చునా... మానవసేవే మాధవసేవ అని నిరూపించిన నిండు హృదయులు మీరు. ఈ కరువుకాలంలో సరుకులన్నీ సకాలంలో సరైన ధరకు యిప్పించడానికి మీరు పడుతున్నపాట్లు ఎవరికీ తెలియవు గనకనా?"

తెలియకేం, ఎవరికి తెలిసినా తెలీకపోయినా హెడ్‌గుమాస్తాకి ఆ పడుతున్న పాట్లు ప్రతీదీ తెలుసు. అమ్మోనియాపిండీ, సూపర్ ఫాస్ఫేట్ రైతులకి ఏ రేటున ఏ తీరున ముట్టుతున్నాయో తెలుసు. ధాన్యం దంపిస్తే వచ్చే చిట్టు, తౌడు యిలాంటివాటిక కూడా ఏ వ్యక్తి ఎవరి సాయంతో కక్కుర్తిపడుతున్నాడో తెలుసు. బేళ్ళకి బేళ్ళు బట్టలు కంట్రోలు రేటుకి ఎంత బాగా అమ్ముడవుతున్నాయో ... కొలతలు చదువుకోని పల్లెటూరివారి ముందు ఎంత శ్రద్ధగా సవరించబడుతున్నాయో స్పష్టంగా తెలుసు. ఉన్నసరకు లేదని చెప్పి, పంచదారా, గోధుమపిండీ బస్తాలకి బస్తాలు మారురేటున మారురూటున పులిసి ఉన్నవాళ్ళ దొంగ అటకల మీదకి ఎలా చేరుతున్నదీ తెలుసు. అన్నీ తెలిసిన గోవిందమూర్తి ఎందుకు పైవాళ్ళకు రిపోర్టు చెయ్యడూ అంటే దానికి నాకుతెలిసినంత వరకూ రెండు కారణాలున్నాయి. ఒకటి యాజులుగారు పైకి రుజువుకి దొరికేలా ఏదీ కాగితం మీద కనిపించనియ్యకుండా జాగ్రత్త పడడమూ, రంగభాష్యం స్వామిభక్తిని రెండవది సరుకులూ కరుకులూ సమర్పించి పైఅఫీసర్ల మూతికట్టెయ్యడంలో యాజులుగారికి ఉన్న అసాధారణమైన నేర్పు. ఈ సంగతులన్నీ రంగనాథంగారికి వివరించి నివారణోపాయం అడుగుదామని గోవిందమూర్తికి అనిపించకపోలేదుగాని డబ్భైఏళ్లు పైబడిన ఆయన మనశ్శాంతిని భంగపరచడం అతనికి యిష్టంలేక పోయింది. వీరివల్లా వారివల్లా స్టోర్సు సంగతులు చెవినిబడి ఆయన విచారించి ఒక్కమాటు అనేవారు. "సంస్కరింపబడవలసింది ప్రభువులు కాదు. ప్రజలు ... భగవంతుడా! నేను అవధ్యుణ్ణి అయిపోయాను. నీ బిడ్డల్ని చెడ్డవాళ్ళను చేసి వినోదించకు. ఇదే నా ప్రార్థన".

అనేక ఆఫీసుల్లో లంచగొండితనం సర్వసాధారణమైపోయింది. ఆ ఉద్యోగస్థుల్లో కొందరు మంచివాళ్ళూ, నిజాయితీ పరులూ ఉండకపోరు. కళ్లముందే జరుగుతున్న "కరప్షన్"చూసి వాళ్ళ హృదయం కరగకపోదు. కాని వాళ్ళు ఏం చెయ్యగలరు? జీతంతో జీవితం ముడిపడి ఉన్న మధ్యతరగతి మనుషులు వాళ్ళు. మంచిపని చెయ్యాలని కోరిక ఉంది. చెడ్డ జరిగితే భరించలేరు. కాని ఏం లాభం? డబ్బూ లేదు, ధైర్యమూ చాలదు. పాలక వర్గంలోని పాతాలు చూసి మంచికి మంచే జరుగుతుందనే ప్రోత్సాహమూ వారికి లేదు. అలాంటి వాడే గోవిందమూర్తి. సమయంకోసం మాత్రం ఎదురు చూడకపోలేదు, అంతే.

రంగభాష్యం మాటలు విని యాజులు ఎంత మాత్రం ఊరట చెందలేక పోయాడు.

"ఎంత పాటుపడితే ఏముందోయ్ భాష్యం, ఒకరికి ఉపకారం చెయ్యడానికైనా కనీస ఆరోగ్యం ఉండాలా? కనీసపు అవసరాలు తీరాలా? ముష్టి జీతం ఈ వంద రూపాయలతో నేను ఎలా 'గెటాన్' అవనోయ్? వెధవది, ఆ తాలూకా కచేరీలో కూచుని నాలుగు దస్తావేజులు గీకి పెడితే రోజుకి పది రూపాయలు కళ్ళజూడ నటోయ్? ప్రజాసేవ కోసం రక్తమాంసాలు ఖర్చు పెడుతున్న మన మంత్రివర్యులే తమ తమ నెలభత్యం ఎక్కువ చేసుకోవడం తప్పదని అంగీకరించారంటే – ఇక నాలాంటివాడు కనీసం రెండొందలయినా ఉంటే గాని..."

గోవిందమూర్తి పళ్ళు పటుపటు కొరికాడు. ఆ రాత్రి అతనికి ఏ మాత్రమూ నిద్ర పట్టలేదు. రంగనాథంగారి జోళ్ళ చప్పుడు – అతనికి అత్యంత ఆత్మీయమైన ఆ శబ్దం–అదే పనిగా అతి సమీపంలో ఉన్నట్టు వినిపించ సాగింది. తెలియకుండా అతని కళ్ళమ్మట నీటిధారలు స్రవించాయి. ఒక రోజా రెండ్రోజులూ కాదు. పదిహేను సంవత్సరాలు ఆ ధన్యజీవి ఒక్క దమ్మిడీ ప్రతిఫలం ఎరక్కుండా పని చేశాడు! చిటారు అర్నెల్లు దాటలేదు. చిసిగు [illegible] కార్యం అందరికీ తెలుసు. ప్రతిఫలం పెంచాలా? [illegible]

మీటింగులో ఏ రంగభాష్యం చేతో యీ ప్రతిపాదన చేయిస్తాడు. మరో అపభ్రంశంగాడు సెకండు చేస్తాడు. ఎలాగా అది నెగ్గి తీరుతుంది. చూస్తూ పూరుకోవలసిందేనా?

"పనితెలిసినవాళ్ళు, నీతిగలవాళ్ళు. వీళ్ళకి వేతనాలు చాలవు" అని ఒకనాటి మీటింగులో రంగనాథంగారు పదిమందిచేతా ఔననిపించి కో-ఆపరేటివ్ స్టోర్స్ స్టాఫ్ అందరి స్కేళ్లూ పెంచడం గోవిందమూర్తి మరచిపోలేదు. "ఆయనకింద పనిచేసి, వీడికింద పనిచెయ్యడంకన్న తలకొట్టుకు చావడం మంచిది. రేపే రాజీనామా యిస్తాను" అనుకుని కొద్దిసేపు మనశ్శాంతి అనుభవించాడు గోవిందమూర్తి. దానితో తాత్కాలికంగా ఏ అరగంటైనా నిద్రపట్టిందేమో— అంతే మళ్ళీ తెలివివచ్చి అంతటా అశాంతి అలుముకుంది. ఓటమి ఒప్పుకోడానికి అతని మనసు ఎంతమాత్రం అంగీకరించ లేదు. అలా కాదని ఎదుర్కోవడ మెలాగో అర్థమూ కాలేదు. పైనుంచి అతన్ని ఓడించుకు రావడం ఎలాగా సాధ్యంకాదు. ఓ సారి కమిటీ మీటింగులో పాపం డైరెక్టర్స్ అందరూ పెద్దమనుషులు. ఎంతో ముఖ్యమైనవాళ్ళ పనులన్నీ పాడుచేసుకుని జనరల్ బాడీ మీటింగుకని ఎంతో దూరంనుంచి వస్తారు. సెకండు క్లాసు రైలు ఫేర్‌కి సరిపడే దారి భత్యం యిప్పించి— ఒక్కొక్క మీటింగుకి ఓ పదిరూపాయిలేనా యివ్వందీ ఏం న్యాయం? పైగా వాళ్ళు వచ్చినప్పుడు అల్పాహారవిందుకుగాను ఓ పాతిక రూపాయిలు ప్రజాధనం వెచ్చించడం బ్రహ్మహత్యా పాతకమా!" అని ప్రతిపాదించి ఔననిపించి ఏనాడో యాజులు పెద్ద బుర్రల అనుగ్రహం సంపాదించి వున్నాడు. ఇక పోతే కిందనుంచే అతన్ని ఎదిరించుకు రావాలి.

నిజానికి యాజులుగారు వచ్చి సెక్రటరీగా చేరిన యీ ఆరు నెలల్లోనూ కో-ఆపరేటివ్ స్టోర్స్‌వర్కర్స్ పొందుతున్న అసంతృప్తి యింతా అంతా కాదు. స్టోర్స్ పనిచేసేకాలం ఆయన మాటి మాటికీ తనకి వీలుగా మారుస్తాడు. స్టోర్స్ బంట్రోతులు ముగ్గురిలోనూ ఒకడు యెప్పుడూ యాజులుగారింటి దగ్గర వుండవలసిందే. ఆ నిర్భాగ్యుడికి కనీసం రోజుకి పన్నెండు గంటలు పని ఉంటుంది. మిగిలిన యిద్దర్లో ఒకడు ఆయన బజారు పనిమీదగాని, ఆయన వెనకాల తైనాతీగాగాని తిరుగుతూ ఉండాలి. ఇక పాల సరఫరా కేంద్రం పితికించుకొచ్చిన మొదటి రకం చిక్కటి పాలు యాజులుగారు స్వయంగా ముందు రుచి చూస్తారు. దానికని కొన్న సైకిలూ, నియమించిన గొల్లవాళ్ళూ వాళ్ళెలా ఉంటారో ఎవరూ చూసిన పాపాన పోలేదు! వారం రోజులు దాటేకగాని పత్రికలు ఎలా ఉంటాయో యాజులుగారింటినుంచి ఊడిపడవు. పోనీ చేసిన దానికి మెప్పేమయినా ఉందా అంటే ఆయనకి పనికన్న ప్రాపకమూ, శ్రమించడంకన్న ఆశ్రయించడం ఎక్కువ ఇష్టం.

"రంగనాథంగారు మొట్టమొదట సెక్రటరీగా పని చేశారు. తర్వాత ప్రెసిడెంటుగా చేసినా సెక్రటరీ పనంతా ఏళ్ళ తరబడి చూసేవారు. వేరే సెక్రటరీ అవసరమే లేదని అనేటట్టు చేశారు. ఇప్పుడాయన రిజైన్ చేశాక సెక్రటరీ తప్పలేదు. సెక్రటరీ 'ఆనరరీ పోస్టు'కాక 'పెయిడ్ పోస్టు' అని ఎప్పుడైతే నిర్ణయించబడిందో యాజులుగారి ప్రజాసేవా తత్పరత పొంగిపొర్లింది. తక్కిన రాబళ్ళు అలా ఉండగా నెల నెలా నూరు కరుకులు మింగుతున్నాడు. అదీ చాలలేదా?"

యాజులుగార్ని స్టాఫ్ అంతా మనసా అసహ్యించుకున్నారు. అయితే నేం? ఎలాంటి వాళ్ళకి అలాంటి దన్ను ఉండకపోదు. అందరికీ సరిపడా ఆయనకి రంగ భాష్యం ఉన్నాడు.

"మీరు కాబట్టి రక్తానికి రక్తం ధారపోస్తున్నారు...శ్రమ ఎక్కువా, ప్రతిఫలం తక్కువా అయితే, ఎవరు మాత్రం ఎన్నాళ్ళని చెయ్యగలరు!" అని పురెక్కించాడు. ఆ రోజు మొదలు యాజులు మరీ మారాం చెయ్యడం ప్రారంభించాడు. ప్రతీ రోజూ అదే పాట మొదలెట్టేడు.

"ఈ రేషనింగ్ మొదలెట్టేక నా బాధ్యత మరీ ఎక్కువైపోయింది. ఊరంతా ఈ స్టోర్సు దగ్గరేఉంటోంది. దగ్గరుండి సరుకు బట్వాడా చేయించే సరికి నా తలప్రాణంతోక్కొస్తోంది. తగిన పారితోషికమూ ఏమైనానా? ఈఅరువు చాకిరీ నావల్ల కాదు... ఈ బండ చాకిరీ నేను చెయ్యలేను బాబూ..."

"ఎందుకూ నాకేం కిట్టుబాటు అవడంలేదు. ఈవారం అయే మీటింగులో ఇదేదో తేల్చేస్తాను" అని ఒకరోజు యాజులుగారు యధాప్రకారంగా గంతులు వేస్తూంటే గోవిందమూర్తి పుసుక్కుననవ్వేశాడు.

"మతీ సుతీ లేకుండా అనవ్వెందుకూ... ఈసారి ఏంజరుగుతుందో చూద్దువుగాని... రాజీనామా పత్రం తయ్యారు చెయ్యవోయ్ రంగ భాష్యం".

"పెద్దలు... మీరలా తొందరపడకూడదు... మీరుకూడా లేకపోతే ఈ ప్రజాసంస్థ ఏంగాను?" అన్నాడు గోవిందమూర్తి వెటకారంగా. కాని అందులో వెటకారం ఆ క్షణమందు అహంకారంతో నిండిపోయిన యాజులు కేమీధ్వనించలేదు. పైగా యిన్నాళ్ళకైనా గోవిందమూర్తి తన తరఫున ఒక మాటాడ్డం చిత్రమైనా అసత్యమనిపించలేదు. ఈ అవకాశం వదిలిపెట్టకూడదని యాజులు అనుకున్నాడు.

"మీ నోటమ్మట యిన్నాళ్ళకైనా ఆమాత్రం మాటొచ్చినందుకు సంతోషించ వలసిన విషయమే! ఒకర్ని అనుకోడం మాత్రం దేనికి లెండి, నేను మాత్రం మీ మంచి చెడలు ఏం కనుక్కున్నానని! అయిందేగ"

అయింది ... ఇప్పుడు మాత్రం ఏమయింది? మూర్తిగారూ, యివాళ మీరు ఆరుకేజీల పంచదార పట్టి గెళ్ళండి. అన్నట్టు మంచి లాంగ్‌క్లాత్ వచ్చి నట్టుంది, ఒకతాను తీసికెళ్లండి పిల్లలికి చొక్కాలికి బాగుంటుంది... గోవిందమూర్తి ఒక్కక్షణం చిత్రంగా చూశాడు. అంతలో అది పైకి తెలియనీయకుండా అటువైపు తిరిగి పోయాడు. ఈ అవకాశం వదలిపెట్ట కూడదని అతనూ అనుకున్నాడు.

'చిత్తం' అన్నాడు అతని జీవితంలో మొదటిసారిగా. రంగభాష్యానికి యాజులు కనుసంజ్ఞ చేశాడు. అతను అందుకున్నాడు.

'పైకి తేలడుగాని మా గోవిందమూర్తికి మాత్రం మీమీద భక్తి శ్రద్ధలు లేవనుకున్నారా పంతులుగారూ? వయసుకు మించిన చాకిరీ జీతాన్ని మించిన కష్టమూ మీరు చేస్తున్నారని మనవాడు ఎంతగా కుమిలి పోతున్నాడనుకొన్నారు!'

'నిజమేనా, నిజమేనా గోవిందమూర్తీ?' అన్నాడు అక్కడ నలుగురిలోనూ ఆమాట నిర్ధారణ చేసేద్దామని.

'చిత్తం - కాదుమరి?' అన్నాడు గోవిందమూర్తి. యాజులికి అరచేతిలో స్వర్గమన్నట్టు అనిపించింది. రంగనాథంగారు పాయిజన్ చేసి వదిలి పెట్టిన ఈ హెడ్‌గుమస్తాగాణ్ణి తనవైపు తిప్పుకుంటే యింక జరగందేముంది?

అంతే. ఆరోజునుంచి గోవిందమూర్తి స్తోమతే మారిపోయింది. ఆయనకి కాస్త తలనొప్పిగా ఉంటే చాలు యాజులుగారే స్వయంగా వచ్చి 'గొడ్డులా చాకిరీ చేస్తే శరీరం తట్టుకోవద్దుటోయ్ - రెండ్రోజులు శలవు చీటీ పంపెయ్యి. మరేం కాలచక్రం ఆగిపోదు' అనేవాడు. 'మంచి తెల్ల గోధుమలు వచ్చాయి. ఓయిరవై కేజీలు యింట్లో పడేయ్ - మళ్ళీ దొరకవ్' అనేవాడు. గోవిందమూర్తి అతను చెప్పినట్టు తూ. చ. తప్పక చేసేవాడు. 'అప్పగారూ నన్ను క్షమించండి. ఈ నాటకం ఇంక ఒక్క వారం రోజులే' అని మనసులో అనుకున్నాడేమో.

ఆవాళ కమిటీ మీటింగు. ఆరోజు మీటింగులో జరిపించ వలసిన పథకం అంతా యాజులు గోవిందమూర్తికి పదేపదే బోధ పరిచాడు. ముందు యాజులుగారు రాజీనామా సమర్పించడం. గోవిందమూర్తి ఆయన స్టోర్సుకి చేస్తున్న సేవలను కొనియాడుతూ - ఆయన పని చేసే కాలాన్ని పొడిగించాల్సిన అత్యావశ్యకత నిరూపిస్తూ - ధరలు ఎక్కువైన కారణంవల్ల అతని జీతం కూడా ఎక్కువ చేస్తామని ఆయన్ని బతిమాలుకుని ఆమోదింప చెయ్యడం. అవసరమైతే ఓటింగుకు పెట్టించి నెగ్గించడం. 'ముందు నా జీతం ఎక్కువ చేయిస్తే నీ ఉపకారం ఉంచుకుంటానటోయ్ ... పిల్లలుగల వాడివి, నీ జీతం మాత్రం ఏమంత ఎక్కువనీ!'



అని ముసిముసి నవ్వు నవ్వేరు యాజులుగారు.

ఆ సాయంకాలం మీటింగులో అన్ని విషయాలూ అయాక 'ఎజండా'లో ఆఖరు విషయంగా యాజులుగారి సంగతి వేయించారు. అది కూడా యాజులు ఏర్పాటే. ప్రజాహిత సంబంధమైన మీటింగులు కనుక కమిటీ మీటింగులకి రాడానికి 'దొర'లకి ఆట్టే తీరుబడి ఉండదు. మీటింగు చివరిదాకా ఉండడానికి మరి అవతలి రాచకార్యాలో ... అందుకని 'మీరంతా ఎలాగంటే అలాగే ... మినిట్సు సంతకం పెడితే చాలుగా?' అని వెళ్ళిపోతారు. ఆఖరికి యాజులూ, గోవిందమూర్తీ అతని స్నేహితులు మరో ముగ్గురూ మిగిలారు. రంగభాష్యం కూడా అక్కడ లేకపోలేదు గాని అతను మెంబరు కాదు.

'ఇంక ఆలస్యం ఎందుకు, కోరమ్ ఉంది గదా! తీర్మానం తీసుకొచ్చి ఆమోదింప చేద్దామా?' అన్నాడు యాజులు రహస్యంగా.

'చిత్తం' అన్నాడు గోవిందమూర్తి గుంభనగా. ఒక పొడిదగ్గు దగ్గి యాజులు తను రాసుకొచ్చింది ఇలా చదివాడు :

'సోదర మణులారా! సోదరీ రమణులారా! ఈనాడు అమూల్యమైన ఈ ప్రజాసేవనుండి వైదొలగుతున్నందుకు నాకు చాలా దుర్భరంగా ఉంది. కో ఆపరేటివ్ స్టోర్సు సెక్రటరీ పదవినుండి విరమించడానికి నేను నిశ్చయించానని చెప్పడానికి విచారంగా ఉంది. ఏం చెయ్యను? ఏదో యీడ్చుకొచ్చానుగాని రంగనాథంగారి లాంటి సంఘసేవకుల ముందు నేనెంత నా బతుకెంత? నేనా దుర్బలుడను. కాగా నిర్ధనుడను. నన్ను క్షమించి విశ్రాంతి యిప్పించవలసినదిగా కమిటీ వారికి వినయ పూర్వకంగా మనవి చేస్తున్నాను' ఆ కాగితం పైసంతకంచేసి గోవిందమూర్తి కిచ్చాడు. అనంతరం ఆ కాగితం గోవిందమూర్తి ఫైల్ చేసి, లేచి యిలా అన్నాడు.

'సోదరులారా! నేడు చాలా దుర్దినం. యాజులువంటివారు మన సంఘాన్ని వదిలిపెట్టి వెళ్ళడం ఎంత దురదృష్టకరమో అనుభవజ్ఞులైన మీకు నేను చెప్పనక్కరలేదు. ఐనా వారు వయసు మళ్ళిన వారు. పైసామీద మనసు మళ్ళనివారు, కృష్ణా-రామా అంటూ యింట్లో కూర్చోక, వారు శలవిచ్చినట్టు—నానాటికీ జటిలమైపోతున్న యీ నామకః ప్రజాసంస్థలతో వారి కేమిపని? సంఘ క్షేమంకన్న వివిధంగా చూసినా నాకు వారి క్షేమమే ముఖ్యంగా కనిపిస్తోంది. వారిని యింకా మొహమాటపెట్టి మనం స్వార్థం చూసుకోడం న్యాయంకాదు. అంతరాంతరాలలో అయిష్టమైనా

వారి వుద్యోగవిరమణ ఆమోదించడమే భావ్యమని భావిస్తున్నాను. విశ్రాంతికాలంలో వారి సంఘసేవకు ప్రతిఫలంగా భగవంతుడు తగిన ఆయురారోగ్యములు ప్రసాదించుగాక !'

ఇక చెప్పేదేముంది, కోరమ్ వుంది గనక 'యాజులుగారి రాజీనామా సభ్యులందరూ ఏకగ్రీవంగా ఆమోదించడమైనది !' అని టకటకా సంతకాలు జరిగిపోయాయి !

'గడ్డీ వేషానికి గెడ్డం మీసం గీయించాడని యీ నాలుగురోజుల భాగ్యానికి ఈ పటాటోపం దేనికో ! రిక్షామీద దేతప్ప భూమ్మీద అడుగు పెట్టమని పిల్లలు మొరాయిస్తున్నారు! గానుగనూనెగాని వేసుకోడుట మీ అల్లుడు ... ... దినపత్రిక చూస్తేగాని యింకా రోజంతా ఏమీ తోచదుట మీ కోడలికి. నూతిలో చేదవేయడం మరచిపోయి ఆర్నెలలయింది కాబోలు మీ చెల్లెలికి. ఇక చిక్కని మర్రిపూడలలాంటి పాలతో ఫిల్టర్ డికాక్షన్‌తో కాఫీ తాగుతేగాని తల ఎగిరిపోతోంది నాకూ ! మాటాడకుండా ముంగిలా జారుకుంటారేం, చేతగాని పరుగులు ఎవరు పెట్టమన్నారంటు !' అని ఆ పదోనాడు కాబోలు నిలదీసింది యాజులుగార్ని కట్టుకున్న కాంతారత్నం.

□□□


ప్రఖ్యాత రచయిత

## కొడవటిగంటి కుటుంబరావుగారి రచనలు

| | | |
|---|---|---|
| కొత్తఅల్లుడు, కొత్తకోడలు | (జంట నవలలు) | 3—50 |
| బ్రతుకు భయం | (నవల) | 2—00 |
| ఎండమావులు | ( ,, ) | 1—50 |
| కురూపి | (రెండు కథలు) | 2—50 |
| పదార్థంలో పరమాణువులు | (వైజ్ఞానిక గ్రంథం) | 1—25 |

నవోదయ పబ్లిషర్స్
ఏలూరు రోడ్ _ విజయవాడ 2







